ప్రజాశక్తి

బుధవారం 12 నవంబర్ 2025

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

పెట్టుబడులు, ఉద్యోగాలు బూటకం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కెఎస్.చలం, వేదికపై ఎంవిఎస్.శర్మ, రమణమూర్తి తదితరులు

- కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేందుకే పెట్టుబడిదారుల సమ్మిట్
- ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు
- 'ఆంధ్రప్రదేశ్ లేబర్ సమ్మిట్ 2025'లో వక్తలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో కార్మికులు తిప్పికొట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సమ్మిట్ల ద్వారా లక్షల పెట్టుబడులు, ఉద్యోగాలు అని ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ బూటకమేనని విమర్శించారు. ఈ నెల 14, 15 తేదీలలో విశాఖలో జరుగుతున్న పారిశ్రామికవేత్తల సమ్మిట్‌కు ప్రత్యామ్నాయంగానూ, సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగానూ సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ఆంధ్రప్రదేశ్ లేబర్ సమ్మిట్ 2025' పేరుతో సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ద్రవిడ యూనివర్సిటీ పూర్వ విసి ప్రొఫెసర్ కెఎస్.చలం మాట్లాడుతూ పెట్టుబడిదారుల సమ్మిట్‌కి ప్రత్యామ్నాయంగా లేబర్ సమ్మిట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను ఎలా నిర్వీర్యం చేస్తున్నదీ ఆయన వివరించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రాముఖ్యతను తెలియజెప్పారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలతో నిర్వహిస్తున్న సమ్మిట్ ద్వారా పెట్టుబడులు వస్తాయని, లక్షలాది మందికి ఉపాధి వస్తుందని చెప్పడం పూర్తిగా అబద్ధమన్నారు. సమ్మిట్ల గత చరిత్రను వివరించారు. చంద్రబాబు ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను సైతం మూసివేస్తోందని తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో 5000 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, 2000 మంది పర్మినెంట్ కార్మికులను విఆర్‌ఎస్ పేరుతో బయటకు పంపారని, విశాఖ డెయిరీలో 350 మంది కార్మికులను తొలగించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక మంది ఉపాధి మిగతా 2లో..

వార్తలు 7లో..



నల్లమట్టిపాలెం వద్ద వరాహా ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి అనిత

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

పారిశ్రామిక ప్రాజెక్టులు, ఎంఎస్ఎంఇ పార్కుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో మంత్రులు

విఎంఆర్‌డిఎ కమిషనర్‌గా తేజ్ భరత్



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) కమిషనర్‌గా 2018 ఐఎఎస్ బ్యాచ్‌కి చెందిన ఎం.తేజ్ భరత్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. తేజ్ భరత్ ప్రస్తుతం మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మునిసిపల్ ఏరియాస్ (మెప్మా) మిషన్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గతంలో తూర్పుగోదావరి జిల్లా జాయింట్ మిగతా 2లో..

ఎసిబికి చిక్కిన అలమండ విఆర్ఒ

వార్త 5లో..

హోరాహోరీగా టేబుల్ టెన్నిస్ పోటీలు

వార్త 2లో..

ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం

వార్త 8లో..

'స్వచ్ఛత'లో విశాఖ పోర్టుకు అవార్డు

దేశంలోనే అగ్రగామిగా గుర్తింపు



అవార్డు స్వీకరిస్తున్న పోర్టు ఛైర్మన్ అంగముత్తు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ స్వచ్ఛతా పఖ్వాడా అవార్డ్స్ - 2024లో సత్తా చాటింది. పరిశ్రమల విభాగంలో దేశంలోనే ప్రథమ స్థానాన్ని సాధించింది. అందుకుగాను సోమవారం ముంబయిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పోర్టులు, నౌకాయన, జల రవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ చేతుల మీదుగా విశాఖ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అవార్డును స్వీకరించారు. పర్యావరణ పరిరక్షణకు పోర్ట్ ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. 'హరిత సాగర్', 'స్వచ్ఛతా హీ సేవా' మిషన్‌ల కింద చేపట్టిన విస్తృత పరిశుభ్రతా కార్యక్రమాలు, పచ్చదనాన్ని పెంపొందించడం, ప్లాస్టిక్ వ్యర్థాల నివారణ చర్యలు వంటి వాటి ద్వారా విశాఖపట్నం పోర్టు ఈ విజయాన్ని సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం పోర్టు ఉద్యోగులు, భాగస్వాములు, ప్రజలందరికీ చెందుతుందని తెలిపారు. ఈ అవార్డుల్లో మొదటి స్థానంలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, రెండో స్థానంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్ట్ అథారిటీ, మూడో స్థానంలో ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ నిలిచాయి. కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, చీఫ్ ఇంజినీర్ ఎన్ఎస్ఆర్‌సి.మూర్తి, సిఎంఇ రామప్రసాద్, సిఎంఒ డాక్టర్ ఎస్.ఉషాదేవి పాల్గొన్నారు.

బ్లాస్ట్ ఫర్నేస్ జిఎం నాగ్ సస్పెన్షన్

- అనుభవం కలిగిన వ్యక్తిపై చర్యల పట్ల సర్వత్రా చర్చ
- ఉక్కు యాజమాన్యం వైఖరి మార్చుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఉక్కునగరం, విశాఖ కలెక్టరేట్

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో అత్యంత అనుభవం కలిగిన బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం జిఎం ఉద్ధం నాగ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఉక్కు యాజమాన్యం తీసుకున్న ఈ చర్య ప్లాంట్‌లో మంగళవారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కర్మాగారంలో దశాబ్దాలుగా పనిచేస్తున్న నాగ్‌కు ముక్కుసూటి మనిషిగా పేరుంది. ప్రొడక్షన్ విషయంలో కొన్ని రోజులుగా ఉక్కు ఉన్నతాధికారులకు, నాగ్‌కు మధ్య స్వల్ప అంతర్గత వివాదం కొనసాగుతున్నట్టు సమాచారం. ఉన్నది ఉన్నట్టు మాట్లాడే నాగ్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగాన్ని అభివృద్ధి చేయడంలో విశేషంగా కృషి చేశారు. అటువంటి అధికారిపై చర్యలు తీసుకుంటూ స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డి సక్సేనా ఆదేశాలు ఇవ్వడంతో కలకలం రేగింది. సస్పెన్షన్‌కుగల కారణాలను ప్లాంట్ యాజమాన్యం బయటపెట్టలేదు.

భయభ్రాంతులకు గురిచేస్తున్న ఉక్కు యాజమాన్యం : సిహెచ్.నర్సింగరావు

స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులను, అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్న యాజమాన్యం తక్షణం వైఖరిని మార్చుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో మూడు దశాబ్దాలుగా అధికారుల ప్రశంసలు, కార్మికుల అభిమానం పొందిన జిఎం ఉద్ధం నాగ్‌పై ఉక్కు యాజమాన్యం సస్పెన్షన్ చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అత్యంత అనుభవం కలిగిన వ్యక్తిని తొలగించడం ద్వారా ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. బ్లాస్ట్ ఫర్నేస్ ఉత్పత్తి పెరగడం లేదని, కోల్ వాడకం తగ్గించలేదని కార్మికులను, అధికారులను బాధ్యులను చేయడం అన్యాయమని నర్సింగరావు పేర్కొన్నారు. ఉత్పత్తి పెరగాలన్నా, నాణ్యమైన ఉత్పత్తి జరగాలన్నా నాణ్యమైన రా మెటీరియల్ అందుబాటులో ఉండాలని తెలిపారు. దానికి విరుద్ధంగా నాసిరకమైన రా మెటీరియల్‌ను ఉపయోగించాలని ఉక్కు యాజమాన్యం ఆదేశించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ చర్యల వల్ల విశాఖ ఉక్కు నాణ్యతపై ప్రభావం పడుతుందన్నారు. వినియోగదారుల నమ్మకాన్ని దెబ్బతీయాలన్న కుట్ర కోణం ఇందులో దాగి ఉందని తెలిపారు. ఈ విషయమై కూటమి ప్రభుత్వం, ప్రధానంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కలుగజేసుకొని తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

హోరాహోరీగా టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ వేదికగా ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 40వ అఖిల భారత తపాలా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన పోటీలలో పురుషుల విభాగంలో పశ్చిమ బెంగాల్ పంజాబ్ జట్టుపైన, తమిళనాడు గుజరాత్ జట్టుపైన, తెలంగాణ మహారాష్ట్ర జట్టుపైన, అసోం ఉత్తరప్రదేశ్ జట్టుపైన విజయం సాధించాయి. అలాగే మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ ఛత్తీస్‌గఢ్‌పైన, పశ్చిమ బెంగాల్ రాజస్థాన్‌పైన, తమిళనాడు తెలంగాణపైన, గుజరాత్ మహారాష్ట్రపైన విజయం సాధించాయి. మంగళవారం నిర్వహించిన పోటీలలో పురుషుల జట్టు ఈవెంట్ మొదటి సెమీఫైనల్‌లో తమిళనాడు పశ్చిమ బెంగాల్‌ను 3-2 తేడాతో ఓడించగా, రెండో సెమీఫైనల్‌లో తెలంగాణ జట్టు అస్సాంపై 3 - 1 తేడాతో విజయం సాధించింది. అదేవిధంగా మహిళల జట్టు ఈవెంట్ మొదటి సెమీఫైనల్‌లో పశ్చిమ బెంగాల్ జట్టు ఆంధ్ర ప్రదేశ్‌ను 3-0 తో ఓడించగా రెండో సెమీఫైనల్‌లో గుజరాత్ జట్టు తమిళనాడుపై 3-1 తేడాతో గెలుపొందింది ఈ పోటీలు బుధవారం సాయంత్రం జరగనున్న ఫైనల్ మ్యాచ్‌తో ముగియనున్నాయి.


హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

న్యాయ సహాయంపై శిక్షణ

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, విశాఖపట్నం ఆధ్వర్యంలో పారాలీగల్ వలంటీర్లకు మూడు రోజులపాటు అధునాతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు మంగళవారం న్యాయసహాయ సేవలను పటిష్టం చేయడంలో భాగంగా, ప్రతి మండల న్యాయసేవాధికార కమిటీ నుండి 25 మంది చొప్పున పారాలీగల్ వలంటీర్లను ఎంపిక చేసి,వారికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కింద విశాఖపట్నం జిల్లాలో గాజువాక, భీమిలి మండలం నుంచి, అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి,చోడవరం, యలమంచిలి, నర్సీపట్నం, మాడుగుల, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి అరకు, పాడేరు, చింతపల్లి మండలాల నుంచి పారా లీగల్ వలంటీర్లు హాజరయ్యారు. బుధవారం, గురువారం శిక్షణలో భాగంగా ఎన్ఎఎల్ఎస్ఎ పథకాలు, పోస్కో చట్టం ప్రాథమిక అంశాలు, బాధితులకు పరిహారం గురించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు శిక్షణ ఇచ్చారు. బుధ,గురు వాహనాలలో సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.ఆదినారాయణ, డిఎల్ఎస్ఎ శిక్షణ పొందిన మధ్యవర్తి బి.శ్రీనివాసరావు, మహిళా, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ సునీత, కుప్పిలి మురళీధర్ అవగాహన కల్పించారు. బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్-1 సభ్యురాలు రహీమున్నీసా బేగం, జిల్లా ప్రొహిబిషన్ అధికారి వి.శ్రీధర్ విశేష అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు తెలిపారు.

బాలల దినోత్సవం రోజు పరీక్షలు తగవు

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: బాలల దినోత్సవం రోజున పరీక్ష నిర్వహించడం అంటే వారి హక్కులను హరించడమే అని వైజాగ్ చిల్డ్రన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ కె. రమాప్రభ ఒక ప్రకటనలో తెలిపారు. బాలల దినోత్సవం పిల్లల హక్కులను కాపాడుతూ, వారి సృజనాత్మకతను, చైతన్యాన్ని గుర్తించే రోజని, నవంబర్ 14న దేశవ్యాప్తంగా పిల్లలలో సామాజిక అవగాహన, సృజనాత్మకత, సాంస్కృతిక వ్యక్తీకరణను ప్రోత్సహించే అనేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతోందన్నారు. అయితే ఇదేరోజు పాఠశాలల్లో ఎస్ఎ1 పరీక్షలు నిర్వహించడం విచారకరం అన్నారు.

అందువల్ల ప్రభుత్వం ఈ విషయంపై పునరాలోచించి, బాలల దినోత్సవం నాడు పరీక్షను రద్దు చేసి, పాఠశాలల్లో సామూహిక కార్యక్రమాలు, పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా సూచనలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

మొదటి పేజీ తరువాయి..

పెట్టుబడులు, ఉద్యోగాలు బూటకం

కోల్పోయారన్నారు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేసి వాటిని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు విచ్చలవిడిగా కారుచౌకగా భూములను కేటాయిస్తోందన్నారు. గతంలో కేటాయించిన భూముల్లో ఇప్పటివరకు పరిశ్రమలు రాలేదన్నారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా 1,60,000 ఉద్యోగాలు వస్తాయని చెప్పడం సరికాదన్నారు. ప్రపంచమంతా వ్యతిరేకించినటువంటి పరిశ్రమలను, సంస్థలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొని వచ్చి అదే తన గొప్పతనంగా చెప్పడం కూటమి ప్రభుత్వానికే చెల్లుతుందని ఎద్దేవా చేశారు. డేటా సెంటర్ వల్ల ఉపాధి పెద్దగా రాదని, కానీ విద్యుత్, నీటి వినియోగం భారీగా పెరుగుతుందని, దీనివల్ల ఉష్ణోగ్రతల్లో మార్పులు సంభవిస్తాయని, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణమూర్తి మాట్లాడుతూ ప్రైవేటు కంపెనీలలో సామాజిక న్యాయం దక్కదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ, వికలాంగులు, మైనార్టీలకు ఉపాధి అవకాశాలు రావన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అన్నింటినీ ఉచితంగా సమకూరుస్తూ, మరో పక్కన వాటిల్లో పనిచేస్తున్నటువంటి కార్మికులకు జీతాలు పెంచకుండా, ఉద్యోగ భద్రత కల్పించకుండా, ఉపాధికి రక్షణ లేకుండా చేస్తున్నారన్నారు. లేబర్ సమ్మిట్‌కు అధ్యక్షత వహించిన సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ సహజ సంపదలను కార్పొరేట్లకు కట్టబెట్టడమే పెట్టుబడిదారుల సమ్మిట్ అసలు ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నిర్మల, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, జిల్లా కార్యదర్శి జివిఎస్‌జె.అచ్యుతరావు, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.అయోధ్యరామ్, బిఎస్ఎన్ఎల్ యూనియన్ జనరల్ సెక్రటరీ సిహెచ్‌విఎస్.సాగర్, ప్రకాష్, ఐఎన్‌సిఐయు అధ్యక్షులు శ్రీనివాసరావు, పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెఎం.కుమార్ మంగళం, కార్యదర్శులు బి.జగన్, పి.వెంకటరావు, కె.చంద్రశేఖర్, పలు కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ కమిషనర్‌గా తేజ్ భరత్

కలెక్టర్‌గా, కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. విఎంఆర్‌డిఎ కమిషనర్‌గా పనిచేసిన కెఎస్.విశ్వనాథన్ ఐ అండ్ పిఆర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్‌గా బదిలీ కావడంతో కొద్ది రోజులుగా ఆ స్థానం ఖాళీగా ఉంది. తాజాగా తేజ్ భరత్‌ను ఆ పోస్టింగ్‌లోకి ప్రభుత్వం పంపించింది.

బయో పైథాన్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బయో-పైథాన్, జనరేటివ్ ఎఐ సాంకేతికతలు ఆరోగ్య రంగం, బయోలాజికల్ పరిశోధన భవిష్యత్తును మలుస్తున్నాయని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ తెలిపారు. మంగళవారం ద్వారకానగర్ కార్యాలయంలో బయోపైథాన్ అవగాహన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బయో-పైథాన్ అనేది బయాలజీ, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ మధ్య వంతెనలా పనిచేసే ఒక ఓపెన్ సోర్స్ పైథాన్ లైబ్రరీ అని, ఇది బయోఇన్ఫార్మాటిక్స్, కంప్యూటేషనల్ బయాలజీ కోసం రూపొందించబడిందని వివరించారు. దీని ద్వారా జీవశాస్త్రవేత్తలు, డేటా సైంటిస్టులు డిఎన్ఎ, ఆర్ఎన్ఎ, ప్రోటీన్ సీక్వెన్సుల వంటి జీవసంబంధిత డేటాను వేగంగా, కచ్చితంగా విశ్లేషించవచ్చని తెలిపారు. ఈ రంగం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించడానికి మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ఈ నెల 15న సాయంత్రం 6 గంటలకు ఉచిత వెబినార్ నిర్వహించనుందని దీనికి ముఖ్య వక్తగా సిఎక్స్ఐఒ, డేటా సైంటిస్టు డాక్టర్ కె.దుర్గా ప్రసాద్ హాజరవుతారని, ఆసక్తి గలవారు సంస్థ వెబ్సైట్ www.millen-niumsoftsol.com ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని విషయాలకు 9248753098 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ ఎం.చందన్, విద్యా సలహాదారు కె.దివ్య పాల్గొన్నారు.

భారత ఆర్థిక వృద్ధిలో భాగస్వామ్యం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: బజాజ్ ఫిన్సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, భారతదేశం యొక్క వేగవంతమైన ఆర్థికవృద్ధిని సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్ ప్రారంభించినట్లు బజాజ్‌ఫిన్సర్వ్ లిమిటెడ్ ఎండి గణేష్‌మోహన్ మంగళవారం తెలిపారు. సిరిపురం లోని ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ న్యూ ఫండ్ ఆఫర్ నవంబర్ 10 న ప్రారంభమై, నవంబర్ 24న ముగుస్తుందని ఈ ఫండ్‌కు నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ టిఆర్ఐ బెంచ్‌మార్క్ గా ఉంటుందని ఆయన తెలిపారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో బిఎఫ్ఎస్ఐ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రెండు దశాబ్దాల్లో ఈ రంగం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు 50 రెట్లు పెరిగిందని ఆయన తెలిపారు.

కెకె లైన్‌లో డిఆర్ఎం విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) లలిత్ బోహ్రా మంగళవారం కెకె.లైన్‌లోని సిలక్‌జోరి - జగదల్‌పూర్ - కోరాపుట్ సెక్షన్‌లో సమగ్ర తనిఖీ నిర్వహించారు. స్టేషన్ యార్డులు, స్టేషన్లు, కాలనీలు, లెవల్ క్రాసింగ్ గేట్లు, వంపులు, పాయింట్స్, క్రాసింగ్స్, సిగ్నల్ పరికరాలు, విద్యుత్ యూనిట్లు, ఓహెచ్ఇ సరఫరా, వైద్యం వంటి అంశాలపై పరిశీలన చేశారు. కొనసాగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాల్సిన అవసరాన్ని, ప్రయాణికులు, సిబ్బంది సౌకర్యాలను మెరుగుపరచాల్సిన ప్రాముఖ్యతను వివరించారు వివరించారు.

పాఠశాలలను సందర్శించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పాఠశాల విద్య విశాఖపట్నం ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జెడి) కె.విజయభాస్కర్ సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అలసత్వం లేకుండా, 10వ తరగతి పబ్లిక్ పరీక్షల మాదిరిగానే క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం ఎఇఒ-2 గంగరాజు, ప్రధానోపాధ్యాయులు కె.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు భాస్కర రావు, సిఆర్‌పి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ప్రత్యేకంగా శ్మశానవాటిక

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: ఆనందపురం మండలం పీకేరు గ్రామంలో నాలుగు ఎకరాల భూమిలో ముస్లింలకు ప్రత్యేకంగా శ్మశానవాటిక ఏర్పాటు చేయటం జరిగిందని, అదేవిదంగా పెందుర్తిలో భూకేటాయింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. మైనారిటీ వెల్ఫేర్ డే, జాతీయ విద్యాదినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ముందుగా కలెక్టర్ హరేందిరప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీ సొసైటీకి సంబంధించిన భూములు సెక్షన్ 22ఎలో ఉన్నాయని వాటిని విడిపించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మధురవాడలో శ్మశానవాటిక అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మైనారిటీ మతపెద్దల కోసం వివిధ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ అబుల్ కలాం ఆజాద్ విద్యారంగంలో తీసుకువచ్చిన సంస్కరణలు ఎంతో ప్రేరణాత్మకమని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ శాఖ కార్యదర్శి ఎండి నజీర్ పాల్గొన్నారు.

పబ్లికేషన్
మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టువారి దివ్యసముఖమునకు
HMOP No. 22/2025

Between :
Lokavarapu @ Karri Harika ....పిటిషనరు
And :
Lokavarapu Sathish Kumar ...రెస్పాండెంటు
To
లోకవరపు సతీష్‌కుమార్, S/o మోహనరావు, వయస్సు 38 సంు॥లు, R/o Flat No. 78, Virat Nagar, Prahladapuram, Visakhapatnam, Pin:530029.

పై నెంబరు దావాలో యిందలి పిటిషనరు విడాకుల మంజూరు నిమిత్తం S.13(1)(ia) (ib) of హిందూ వివాహ చట్టం క్రింది పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ వాయిదా **తేది 27-11-2025కి** వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా దినం పై కోర్టులో **ఉదయం 10-30 గం॥లకు** స్వయంగా గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మాణించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

//బై ఆర్డర్//

G.Meena
బొబ్బిలి — పిటిషనరు తరుపు అడ్వకేట్
తేది: 12-11-2025 — బొబ్బిలి

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
I.A.629/2023 in O.S.539/2016

Between:
Smt. Bodapati Swarajya Lakshmi ...Petitioner/Plaintiff
And:
Uppili Eswara Rao & others ...Respondents/Defendants

NOTICE

To,
R-5: Sri Uppili Yeruku Naidu,
S/o. late Jagga Rao,
aged about 46 years,
R/at D.No.58-25-101,
Butchirajupalem,
Near NAD Junction,
Visakhapatnam.

Please take notice that the above named petitioner/plaintiff filed above numbered petition/suit against the Defendants/Respondents along with you and the matter is coming for your appearance and stands posted to **03-12-2025**, on that day you are personally or through Advocate attend before the Hon'ble Court at **10:30 A.M** failing which the matter will be decided under Court of law.

(By Order of the Hon'ble Court)
LANKA SRINIVAS KUMAR,
Advocate,
Visakhapatnam.

మహారాజశ్రీ, గాజువాక ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
EP.18/2025 in OS.270/2018

బిట్వీన్:
దుగ్గపు వెంకట అప్పారావు, తండ్రి అప్పలనాయుడు, వయస్సు 48 సం. నివాసం: డో.నెం. 30-30-112, కాశీపాలెం కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం-46 . . . **DHr**
మరియు:
కట్టా కృష్ణారావు . . . **JDr**

JDr: కట్టా కృష్ణారావు, తండ్రి అప్పలస్వామి, హిందూ, వయస్సు 55 సంవత్సరాలు నివాసం:డో.నెం. 28-66-2/1, కణితికాలనీ, వడ్లపూడి RH.C, విశాఖపట్నం-46

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు పై పిటిషన్‌లోJDr గా అయి ఉండీ మీ నుండి డిక్రీ సొమ్ము రాబట్టు నిమిత్తం మీ పై వాలంటరి రిటైర్మెంటు అటాచ్మెంట్‌కై పిటిషన్‌లో వేసియుండి, మీ హాజరు నిమిత్తం **తేదీ 18-11-2025**కు పైకోర్టు వారు వాయిదా వేసియున్నారు. మీకు పై పిటిషన్‌లో నోటీసు పంపించినప్పటికీ మీరు కోర్ట్‌కు హాజరు కాకపోవడము వలన పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తేదీ 18-11-2025 ఉదయం 10 గం.30 నిమిషములకు** పై కోర్ట్ వారు ముందు మీరు గాని, మీ ప్లీడరు గారు ద్వారా గాని హాజరు నిమిత్తం ఈ పేపరు ద్వారా మీ హాజరుకై కోర్టువారు ఆర్డరు వేసి యున్నారు. మీరు హాజరు కానీ పక్షములో పై పిటిషన్లో మీకు వాదన లేదని భావించి మీ పరోక్షంగా తీర్మానించబడును.

(బై ఆర్డర్)
డి.వి.రామారావు, అడ్వకేట్,
గాజువాక, సెల్: 9849595933

బీచ్‌లలో ప్రమాద నివారణకు చర్యలు : డిఐజి

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్రంలోని బీచ్‌లలో పర్యాటకులు మునిగిపోవు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టినట్లు విశాఖపట్నం రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిఐజి), కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఇన్‌ఛార్జ్ గోపీనాథ్ జెట్టి తెలిపారు. విశాఖ రేంజ్ డిఐజి కోస్టల్ సెక్యూరిటీ అధికారులతో కలిసి రుషికొండ బీచ్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. పర్యాటకుల భద్రత ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. బీచ్‌లలో ప్రజలకు నిరంతరం ముందు జాగ్రత్త సమాచారాన్ని అందించాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీచ్‌లలో ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారంగా పబ్లిక్ అడ్రసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ వ్యవస్థను రాష్ట్రంలోని 21 మెరైన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న అన్ని బీచ్‌లలోనూ దశలవారీగా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇందుకోసం పోల్స్, మైక్రోఫోన్లను అమర్చి, నిరంతరాయంగా పర్యాటకులకు జాగ్రత్త సందేశాలు, హెచ్చరికలు, భద్రతా సమాచారాన్ని తెలుగులో ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. ఈ చర్య ద్వారా పర్యాటకులు లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా, ప్రమాదకర పరిస్థితుల్లో ఈత కొట్టకుండా నివారించి, ప్రాణ నష్టాన్ని పూర్తిగా అరికట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. పర్యాటకులు ఆనందంగా గడిపేందుకు బీచ్‌కు వస్తారని, వారి భద్రత ముఖ్యమని చెప్పారు. పోలీస్ అధికారుల సూచనలను పాటించి పర్యాటకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ అడిషనల్ ఎస్‌పి మధుసూదనరావు, రుషికొండ మెరైన్ పిఎస్ సిఐ వి.శ్రీనివాసరావు, ఎస్ఐ జి.మురళీకృష్ణ, పి.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

అవంతిలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎపిసిటి సంయుక్త ఆధ్వర్యంలో హైడ్రోజన్ ఎనర్జీ ఇన్ ఇండియన్ లాంగ్వేజస్ అవేర్నెస్ అండ్ ఇన్నోవేషన్‌పై మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. రోల్ అఫ్ హైడ్రోజన్ ఇన్ క్లీన్ మోబిలిటీ అండ్ ఇండస్ట్రియల్ యూజ్ అంశంపై ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాస్ వివరించారు. నేషనల్ హైడ్రోజన్ మిషన్ అండ్ ఇండస్ట్రీ రెడినెస్‌పై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీధర్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ మాట్లాడుతూ, వర్క్‌షాప్ ద్వారా హైడ్రోజన్ ఎనర్జీపై అవగాహన పరిశోధన నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి మరింత పెరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎ.చంద్రశేఖర్, విశ్వప్రసాద్, షరీఫ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

170 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : చిప్పాడ దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో మంగళవారం బసవపాలెం, తూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 170 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనస్వి, ఆప్తమాలజిస్ట్ గణపతి నేత్ర పరీక్షలు చేసి 40 మందికి చుక్కల మందు, మల్టీ విటమిన్స్ మందులను దివీస్ సంస్థ ద్వారా ఉచితంగా అందజేశారు. 11 మంది విద్యార్థులకు కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. కళ్లద్దాలు 15 రోజులలో ఏర్పాటు చేస్తామని దివీస్ సిఎస్ఆర్ అధికారి డి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రతినిధులు కె.నరసింహ, ఎ.శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - ఆనందపురం: రోడ్డు ప్రమాదానికి గురైన చేయి విరిగి చికిత్స పొందుతున్న ఆనందపురం మండలం చందక గ్రామానికి చెందిన విజయదుర్గ వెల్డింగ్ వర్క్సుకు చెందిన వెంకన్నకు వెల్డింగ్ యూనియన్ సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సహాయం మంగళవారం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు వెన్ని అప్పలరాజు మాట్లాడుతూ, యూనియన్ సభ్యుల్లో ఎవరైనా కష్టాల్లో ఉంటే వారిని ఆదుకోవడం బాధ్యతగా భావిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్డింగ్ యూనియన్ సభ్యులు ముగడ శీను, దుద్దుపూడి కృష్ణ, నమ్మి అప్పలరాజు, ఎర్ర సాయి, ప్రకాశ్ పాల్గొన్నారు.

నేటి నుండి ప్రత్యేక గ్రామసభలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలో ఈ నెల 12 నుంచి 26వ తేదీ వరకు స్వామిత్వ ప్రత్యేక గ్రామసభలో నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ కె.రూపేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామ సభలో ఆస్తుల ధ్రువీకరణ జరుగుతుందని పేర్కొన్నారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని చిప్పాడ దివీస్ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్.రావు విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎంఎస్ఎన్.రావు హాజరై మాట్లాడారు. జీవితంలో స్థిరపడాలంటే లక్ష్యాన్ని సాధించే వరకు శ్రమించాలని విద్యార్థులకు సూచించారు. జీవితంలో ఉన్నతస్థానాల్లో స్థిరపడినప్పటికీ చదువుకున్న విద్యాసంస్థను మరువరాదని సూచించారు. జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధి, కళాశాల సమగ్ర సమాచారాన్ని వివరించారు. కార్పొరేటర్ గాడు చిన్ని కుమారిలక్ష్మి, కళాశాల విద్యార్థి సంఘం పూర్వ అధ్యక్షులు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు. 2025 - 26 స్టూడెంట్ హ్యాండ్ బుక్, కళాశాలకు చెందిన మల్టీ డిసిప్లినరీ జర్నల్స్‌ను ముఖ్య, ప్రత్యేక అతిథులు ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి నిడిగట్టు, కె.నగరపాలెం, కాపులుప్పాడ, జెవి.అగ్రహారం, చేపలుప్పాడ గ్రామాల్లో జివిఎంసి నిధులు రూ.3.05కోట్లతో నిర్మించనున్న రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జివిఎంసి పరిధిలోని 1 నుంచి 8 వార్డుల్లో రూ.150 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, టిడిపి వార్డు అధ్యక్షులు పాసి నరసింగరావు, త్రినాథ్‌కుమార్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బోర రాధాకుమారి, మాజీ సర్పంచ్ కారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో నేడు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-మధురవాడ : కేన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవడానికి వీలుగా సాధారణ ప్రజానీకానికి గీతం ఆసుపత్రిలో నవంబర్ 12వ తేదీన ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గీతం ఆసుపత్రి ఆపరేషన్స్ విభాగం అధిపతి డాక్టర్ కార్తిక్ తెలిపారు. పాప్‌స్మియర్ పరీక్ష ద్వారా కేన్సర్ లక్షణాలు ఉన్నాయా, లేదా అని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. మహిళలకోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 21 నుంచి 65 సంవత్సరాల వయస్సు గల మహిళలు మూడేళ్లకోసారి ఈ పరీక్షలు చేయించుకోవడం మంచిదని వివరించారు. గీతం ఆస్పత్రి గైనకాలజీ విభాగంలో 12వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నూతన విద్యావిధానంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-మధురవాడ : నూతన జాతీయ విద్యావిధానంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎన్ఇపి ప్రయోజనాలపై ప్రత్యేక పోస్టర్‌ను, నినాదాలతో కూడిన బోర్డులతో విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, దేశంలో విద్యను మెరుగుపరచడానికి నూతన విద్యావిధానం దోహదపడుతుందన్నారు. మాతృభాషలో విద్యాబోధన, విద్యాలో సాంకేతికతను అనుసంధానించడం, ప్రపంచ స్థాయి ప్రమాణాలను నెలకొల్పడం, అందరికీ సమాన విద్యా అవకాశలు కల్పించడం వంటివి ప్రయోజనకరంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి వేడుకలు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా రెవిన్యూ అధికారి సత్యనారాయణరావు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యనిర్వాహక సంచాలకులు షంసున్నీసా బేగం, పాల్గొన్నారు.

డైట్‌లో జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్ ప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు విద్య-దాని ప్రాముఖ్యత అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా ట్రెజరీ అధికారి వి.లక్ష్మీ సుభాషిణి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు.

కె.కోటపాడు : స్థానికఅయ్యన్న విద్యా సంస్థల ప్రాంగణంలో మౌలానా అబుల్ కలాం విగ్రహానికి ఎంఇఒ-1 కూనిరెడ్డి సత్యనారాయణ, విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీంతో పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ సుమతి పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : అబుల్ కలాం ఆజాద్ అడుగుజాడలలో అందరూ నడవాలని జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి అన్నారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అదనపు కమిషనర్ ఎస్-ఎస్.వర్మ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

సీతమ్మధార : జనసేన పార్టీ నగర కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెహమాన్, మహమ్మద్ షాదిక్, శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జివిఎంసి 4వ వార్డు పరిధి చిన ఉప్పాడ ఎస్‌సి కాలనీలో చోటు చేసుకుంది. సిఐ బి.తిరుమలరావు కథనం ప్రకారం.. చిన ఉప్పాడ, ఎస్సీ కాలనీకి చెందిన మైలపల్లి ఈశ్వరరావు (46) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని బెడ్ రూమ్‌లో బెడ్ షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈశ్వరరావు భార్య స్రవంతి మధ్యాహ్నం 3.30 గంటలకు ఇంటికి చేరుకుంది. తలుపులు వేసి ఉన్నాయి. ఎంతకీ తీయకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టారు. భర్త సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉండడాన్ని చూసి ఒక్క సారిగా కుప్పకూలింది. భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఈశ్వరరావు మద్యానికి బానిసై కొంత కాలంగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. అప్పులు కూడా చేశాడు. భార్య స్రవంతి పలు ఇళ్ల వద్ద పాచి పనులు చేస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటుంది. వీరికి వివాహమై సుమారు 17 ఏళ్లు అవుతుంది. 16 ఏళ్ల కుమారుడు, 14 ఏళ్ల కుమార్తె ఉన్నారు. మత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తగరపువలస : శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం దూసి గ్రామానికి చెందిన చందక శ్రీనివాస్ (33) ఈ నెల 10వ తేదీన చిట్టివలస జ్యూట్ మిల్ రోడ్డులో రామాలయం వద్ద గడ్డి మందు మృతి చెందాడు. మృతుని తమ్ముడు చందక జగదీష్ భీమిలి పోలీసులకు చేసిన ఫిర్యాదు వివరాలిలావున్నాయి... అన్న శ్రీనివాస్‌కు లావణ్యతో గత సంవత్సరం వివాహమైందని జరిగింది. ఇరువురి మధ్య మనస్పర్ధలు కారణంగా లావణ్య ఆరు నెలల కిందట పుట్టింటికి వెళ్లింది. దీంతో శ్రీనివాస్ మనస్తాపం చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నాడు. ఈ మేరకు భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలోవ్యక్తి దుర్మరణం చెందాడు. భీమిలి మండలం చిల్లపేట ప్రాంతానికి చెందిన ఎరుసు సోమేశ్వరరావు (40), అతని బావమరిది జీరు ప్రసాద్ (34) కలిసి ద్విచక్రవాహనంపై ఆనందపురం నుండి పెందుర్తి సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తున్నారు. మామిడిలోవ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో వెనుక కూర్చున్న సోమేశ్వరరావు అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలవడంతో సోమేశ్వరరావును పెందుర్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు తాపీ పని చేస్తుండేవాడు. అతనికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక బాబు ఉన్నారు. భార్య నడుము సమస్యతో మంచం పట్టింది. సోమేశ్వరరావు చనిపోవడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. ఆనందపురం సిఐ సిహెచ్.వాసు నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో బంగారమ్మపాలెం గ్రామంలో రేషన్ బియ్యం పట్టుకున్నట్టు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దారు గణపతి తెలిపారు. మంగళవారం సాయంత్రం తమకు వచ్చిన సమాచారం మేరకు రెండు ఇళ్లపై విశాఖపట్నం నుండి వచ్చిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ బృందం సభ్యులు, తాము కలిసి దాడి చేసినట్లు వెల్లడించారు. ఈ దాడిలో 3 క్వింటల రేషన్ బియ్యం లభ్యం తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని సిజ్ చేసి నక్కపల్లి గోదాముకు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో స్థానిక రెవిన్యూ అధికారులు, సిఐ యల్ రామకృష్ణ, ఎ.విభూషణ్ రావు పాల్గొన్నారు.

18 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - చీడికాడ : మండలంలోని మంచాల గదబూరు వద్ద మంగళవారం పోలీసుల తనిఖీల్లో 18 కేజీల గంజాయితో ఐదుగురిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ముందుస్తు సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేపట్టగా నాలుగు మోటార్ సైకిళ్ళపై ఐదుగురు 18 కేజీల గంజాయితో ఏజెన్సీ ప్రాంతం నుంచి కోనాం మీదుగా వస్తుండగా మంచాల గదబూరు వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల్లో ముగ్గురు పెదబయలు మండలానికి చెందినవారు కాగా, మరో ఇద్దరు ప్రకాశం, పల్నాడు జిల్లాలకు చెందిన వారిగా గుర్తించామన్నారు. నాలుగు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎండిపిఎస్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఉగ్రవాదదాడులపై రక్షణకు చర్యలు

ప్రజాశక్తి - వేపగుంట : సింహాచలంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో అత్యవసర పరిస్థితులు, ముఖ్యంగా ఉగ్రవాదుల దాడులు జరిగితే ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయంపై వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఉగ్రవాద నిరోధక దళం (ఆక్టోపస్) అధికారులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, ఇతర ముఖ్య విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితులు, ముఖ్యంగా టెర్రరిస్టులు దేవాలయాలపై దాడి చేసే సందర్భంలో అనుసరించాల్సిన వ్యూహాలు, సమన్వయకం, ప్రతిస్పందన పద్ధతులపై ఆక్టోపస్ డిఎస్‌పి ఐ.తిరుపతయ్య, ఇన్‌స్పెక్టర్ శ్రీవాజి వివరించారు. ఉగ్రవాద దాడి వంటి అనూహ్య ఘటనలు జరిగినప్పుడు, ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడానికి తక్షణ చర్యలు, అప్రమత్తత, భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని వారు నొక్కి చెప్పారు.

ఆలయ కార్య నిర్వహణాధికారి ఎన్.సుజాత మాట్లాడుతూ, దేవస్థానం భద్రతను మరింత పటిష్టం చేయడానికి, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను అనుసరించడానికి మాక్ డ్రిల్స్, శిక్షణ ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారులు వాడ్రేవు రవణమూర్తి, కె.తిరుమలేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఉపాధి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు, స్థానికులకు ఉపాధి రక్షణ కల్పించాలని కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు నమ్మి రమణ డిమాండ్ చేశారు. పెదగంట్యాడ సిడబ్ల్యుసి వద్ద అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 16వ తేదీన స్టీల్‌ప్లాంట్‌లోని నెహ్రూ పార్క్ వద్ద అఖిలపక్ష సంఘాల కార్మికులతో సమావేశం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. దీనికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధి, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, బయోమెట్రిక్ బ్లాక్ ఎత్తేయాలని తదితర సమస్యపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి రవి, భాస్కరరావు, వంశీ, యు.అప్పారావు, కోన రమణ, సోంబాబు, నందికి తాతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చట్టి వెంకటరమణ

ఎమ్మెల్యే పల్లాకు ధన్యవాదాలు

ప్రజాశక్తి -గాజువాక : ఏపి టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్‌కు ఇచ్చిన హామీ మేరకు స్థలం కేటాయించిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చట్టి వెంకటరమణ ధన్యవాదాలు తెలిపారు. గాజువాక ఆటోనగర్‌లో మంగళవారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాజువాక ఆటోనగర్ లాంటి ప్రాంతంలో స్థలం కేటాయించడం మంచి పరిణామం అన్నారు. భవిష్యత్తులో ఆఫీస్ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కర్లం కనకారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పరదేశి, కార్యవర్గ సభ్యులు పాపారావు, అచ్చిబాబు, ప్రసాదు, అంజి, రమణ, శ్రీహరి పాల్గొన్నారు.

17 నుంచి కుష్టువ్యాధి గుర్తింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుంచి కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమావేశమందిరంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులకు కుష్టు నిర్ధారణపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ ఆర్.రమేష్ మాట్లాడుతూ, సకాలంలో గుర్తించి చికిత్స చేయిస్తే కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 920 బృందాలు ఈ వ్యాధి గుర్తింపు కార్యక్రమంలో పని చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ పద్మజ, ప్రసాదరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

రిటర్నింగ్ వాల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి కొండవాలు ప్రాంతమైన బిసి కాలనీలో రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల తుపాన్ కారణంగా కూలిపోయిన రహదారికి సపోర్టుగా జివిఎంసి నిధులు రూ 1.26 కోట్లతో రిటర్నింగ్ వాల్‌ను నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎఇ వెంకటరావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, బుడుమూరు గోవిందు, ఒమ్మి పోలారావు, ముగడ రాజారావు, మూది అప్పారావు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - పద్మనాభం : సిఐటియు అఖిలభారత మహాసభల కోసం మండలంలోని పద్మనాభం గ్రామంలో మంగళవారం విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, నిత్యమూ పోరాటాలు సాగిస్తున్న సిఐటియుకు ప్రజలు విరాళాలు ఇచ్చి సహకరించాలని కోరారు. మండలంలోని పద్మనాభం, కృష్ణాపురం, మద్ది, విజయరాంపురం, తునివలస, కొయ్యిపేట గ్రామాల్లో సహకరించడానికి నాయకులు నిర్దేశించుకున్నారు.

అప్పన్న దర్శనానికి పాదయాత్ర

ప్రజాశక్తి -గోపాలపట్నం : శ్రీవరహాలక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకునేందుకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గణబాబు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి నుండి సింహాచలం వరకు కాలి నడకన చేరుకున్నారు. దేవస్థానం అధికారులు, ఆలయ అర్చకులు గణబాబుకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణబాబు పూర్వీకులు ఏటా కార్తీక మాసంలో తాళమేళాలతో సాము గరిడీలతో పాదయాత్రగా వెళ్లిసింహాద్రి అప్పన్నను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఆనవాయితీని గణబాబు పాటిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా కార్యకర్తలు శ్రేయోభిలాషులు, కూటమి నాయకులు మంగళవారం ఉదయం గణబాబు ఇంటికి అధిక సంఖ్యలో చేరుకున్నారు. కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్ గణబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



అప్పన్న దర్శనానికి పాదయాత్రగా వెళ్తున్న గణబాబు కుటుంబీకులు

కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గంటా శ్రీనివాసరావు, విష్ణు కుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, మేయర్ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, డిసిసిబి ఛైర్మన్ కోన తాతారావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జనసేన నాయకులు అంగ దుర్గాప్రశాంత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -గాజువాక : మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జివిఎంసి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు గొలగాని అప్పారావు పిలుపునిచ్చారు. చినగంట్యాడలో జరిగిన సమావేశంలో మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 15, 16 తేదీల్లో ప్రకాశం జిల్లాలో ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 15వ రాష్ట్ర మహాసభలు, ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్క నాగరాజు, రాము, గణేష్ మీనాక్షి, కుమారి పాల్గొన్నారు.

అందెశ్రీ మృతి తెలుగు సాహితీ లోకానికి తీరని లోటు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రజాకవి అందెశ్రీ ఆకస్మిక మరణం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటు అని ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం పేర్కొంది. జయ జయహే తెలంగాణ గీతంతో సమాజంలోని అన్ని వర్గాలను కదిలించిన గొప్ప వ్యక్తి అందెశ్రీ అని సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో, ఆ తరువాత తెలంగాణ జాతిని జాగృతం చేసే విషయంలో రాజీ పడకుండా పని చేశారని కొనియాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తన గేయాలతో యువతను, ప్రజలను చైతన్య పరిచిన అందెశ్రీ ప్రజా కవిగా చిరస్థాయిగా నిలుస్తారన్నారు.

పిపిగా పిఎస్.నాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- లీగల్ : ఉమ్మడి విశాఖ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సీనియర్ న్యాయవాది పిఎస్.నాయుడు మంగళవారం జిల్లా కోర్టులో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన చాంబర్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. విశాఖపట్నం న్యాయవాద సంఘం న్యాయవాదులు హాజరై పిఎస్.నాయుడుకు శుభాకాంక్షలు తెలియజేశారు. గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం తదితర ప్రాంతాల బార్ అసోసియేషన్లకు చెందిన న్యాయవాదులు విచ్చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంకె.శ్రీనివాస్, కార్యదర్శి ఎల్‌పి.నాయుడు, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ ఎస్.కృష్ణమోహన్, సభ్యులు పి.నర్సింహారావు, కె.రామజోగేశ్వరరావు, బైపా అరుణ్ కుమార్, బుగత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- సీతమ్మధార : భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ద్వారా పాఠశాల చిత్రలేఖన పోటీలో మధురానగర్‌లోని జివిఎంసి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అక్టోబర్ 23న జరిగిన స్కూల్ లెవెల్ పోటీలో 53 మంది విద్యార్థులు పాల్గొనగా రాష్ట్ర స్థాయి పోటీలకు నలుగురి విద్యార్థుల పెయింటింగ్స్ ఎంపికయ్యాయని వ్యాయామ ఉపాధ్యాయులు భాస్కరరావు తెలిపారు. వీటిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపగా జూనియర్ విభాగంలో బి.శ్రీహర్ష, సీనియర్ విభాగంలో పి.జగన్నాథ్ రాష్ట్రస్థాయిలో పోటీకి అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీలో వీరు పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఆహార భద్రత తనిఖీలు : నిల్వ ఆహారం స్వాధీనం

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం, నరసింహనగర్ ప్రాంతంలో ఉన్న సెలబ్రేషన్స్ హోటల్‌లో జివిఎంసి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు ఆధ్వర్యంలో ఆహార భద్రత తనిఖీలను నిర్వహించారు. తనిఖీల్లో 12.3 కిలోల వరకు నిల్వ చేసిన ఆహార పదార్థాలను గుర్తించారు. రూ.12,550 విలువైన చికెన్, ఫిష్, పన్నీర్, ఫ్రైడ్ రైస్, దాల్‌ను గుర్తించారు. సంబంధిత నిల్వ పదార్థాలను సీజ్ చేసి, శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించినట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తెలిపారు. హోటల్ యజమానులు, చిరు వ్యాపారులు నాణ్యత, పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

'విజ్ఞాన్'లో వర్క్‌షాప్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ కళాశాలలో 'ఇంట్రడక్షన్ టు ఫైనాన్షియల్ ప్లానింగ్' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ప్రతినిధి డాక్టర్ శ్రీను మాడెం రిసోర్స్ పర్సన్‌గా హాజరై ఫ్యాకల్టీ సభ్యులకు ఆర్థిక ప్రణాళిక, ఆర్థిక నిర్వహణ, వ్యక్తిగత పెట్టుబడులపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్, ఫిన్ సంజీవి ఇడబ్ల్యుఎస్ మధ్య సహకార ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థుల్లో ఫైనాన్షియల్ లిటరసీ, కెరీర్ గైడెన్స్, వెల్త్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్ రంగాలలో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎంఒయు పత్రాలను డాక్టర్ శ్రీను మాడెం, ప్రిన్సిపల్ డాక్టర్ బి.అరుంధతి పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

ప్రజాశక్తి- లీగల్ : నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ఇద్దరి మరణానికి కారణమైన లారీ డ్రైవర్ మాలోతు గోవింద్ (34)కు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకపోతే మూడు నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్‌కు తీవ్రమైన గాయాలు కలిగించినందుకు రూ.1,000 జరిమానా, కారు డ్రైవర్‌కు సాధారణ గాయాలు కలిగించినందుకు రూ.500 జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం... 2020 అక్టోబర్ 11వ తేదీన హనుమంతువాక సిగ్నల్ పాయింట్ వద్ద నిందితుడు తన లారీని అధిక వేగంతో, హారన్ కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరు బైక్ రైడర్లను ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. అదే ప్రమాదంలో కారు డ్రైవర్, ఆటో డ్రైవర్ గాయపడ్డారు. ఈ ఘటనపై గాయపడిన పులపా నర్సింహరావు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సబ్‌ఇన్‌స్పెక్టర్ బి.అప్పారావు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపిల్లి ఆదినారాయణ నిందితుడి దోషాన్ని రుజువు చేశారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ టీషర్టుల పంపిణీ

ప్రజాశక్తి- ఆనందపురం : ఎ స్క్వేర్ గో కార్టింగ్ అధినేత బొడ్డేటి వెంకటరమణ ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 30 స్పోర్ట్స్ టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొడ్డేటి వెంకటరమణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు వీటిని పంపిణీచేసినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు మూర్తి, ప్రసాద్, బుజ్జి, వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు టీ షర్టులు పంపిణీచేసిన వెంకటరమణ

ఎసిబికి చిక్కిన అలమండ విఆర్ఒ

రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన సూర్యనారాయణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : పట్టాదారు పాస్ పుస్తకం నిమిత్తం రైతు నుండి లంచం తీసుకుంటూ ఎం.అలమండ వీఆర్వో చుక్క సూర్యనారాయణ ఎసిబి అధికారులకు నేరుగా పట్టుబడ్డారు. విశాఖ ఏసీబీ డీఎస్పీ బివిఎస్ఎస్.రమణమూర్తి మీడియాకు తెలియజేసిన వివరాలు ప్రకారం... పెదనందిపల్లి గ్రామానికి చెందిన యస్.అమ్మతల్లినాయుడు ఎం.అలమండ గ్రామంలో తన బావకు చెందిన వ్యవసాయ భూమి సర్వే నెంబర్ 281లో 0.55 సెంట్లును రెవిన్యూ రికార్డులలో మ్యుటేషన్ చేసి ఈ-పాస్ బుక్ జారీ చేయడం కోసం ఎం.అలమండ వీఆర్వో చుక్క సూర్యనారాయణను సంప్రదించారు. ఈ ప్రక్రియ కోసం వీఆర్వో రూ.25 వేల లంచం డిమాండ్ చేయగా, చివరికి రూ.20 వేలకు ఒప్పందం కుదిరింది. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేని అమ్మతల్లి నాయుడు విశాఖ ఏసీబీ డిఎస్పి బివిఎస్ఎస్ రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. ఎసిబి అధికారుల ప్లాన్ ప్రకారం మంగళవారం అమ్మతల్లినాయుడు నల్లబిల్లి వద్ద లంచం డబ్బులు వీఆర్వో చుక్క సూర్యనారాయణకు ఇస్తుండగా, ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విఆర్ఓను అదుపులోకి తీసుకుని విచారించారు. వీఆర్వో లంచం తీసుకున్న డబ్బును సాక్ష్యాలతో సహా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకొని, వీఆర్వో ఇంట్లో సైతం సోదాల నిర్వహిస్తున్నామని డిఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు లక్ష్మణరావు, వెంకట్రావు, సుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి ఘటనలను గమనించిన వారు ఎసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064, మొబైల్ నంబర్ 94404 40057 లేదా ఇమెయిల్ complaints-acb@ap.gov.in ద్వారా సమాచారం అందించవచ్చని ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వం పారదర్శకంగా పౌరసేవలు అందిస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ ఆ సేవలను పొందాలనుకునే ప్రజలు మాత్రం రెవెన్యూ అధికారులకు భారీగా లంచాలు సమర్పించుకుంటే గానీ పని ముందుకు వెళ్లడం లేదన్నది ఈ సంఘటన రుజువు చేస్తుందని పలువురు అంటున్నారు.



ఎసిబికి పట్టుబడిన విఆర్ఒ సూర్యనారాయణ



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంఇఒలు

బడి భోజనం రుచిగా పెట్టాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచిగా పరిశుభ్రంగా తయారు చేసి పెట్టాలని మండల విద్యాశాఖ అధికారులు కె.సత్యనారాయణ, డివిడి.ప్రసాద్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాల్సిన కోడిగుడ్డు కూర సరిగ్గా వండకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రసం కూడా రుచిగా లేదన్నారు. భోజనం రుచిగా శుచిగా తయారు చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

90 లక్షల లీటర్ల మంచినీటి సరఫరాకు ప్రణాళిక

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాలిటీ జనాభాకు నిత్యం మంచినీరు అందించాలంటే కనీసం 7.6 లక్షల లీటర్లు అవసరం ఉందని, అయితే ప్రస్తుతం ఉన్న వనరులతో 3.5 లక్షల లీటర్లు మాత్రమే అందించగలుగుతున్నామని మున్సిపల్ ఏఈ గణపతి సుబ్బారావు మంగళవారం విలేకర్లకు తెలిపారు. భవిష్యత్‌లో ఎఐఐబి ప్రాజెక్టు ద్వారా 90 లక్షల లీటర్ల మంచినీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలో నిత్యం సరఫరా అవుతున్న మంచినీటిలో క్లోరిన్ శాతాన్ని రికార్డు చేసి అమరావతి పంపించాల్సి ఉంటుందన్నారు. సంపు నుండి సరఫరా అయ్యే దగ్గరలోని మంచినీటిలో 2శాతం పార్ట్ పెర్ మిలియన్ (పిపిఎం) ఉంటుందని, అదే చివరి కుళాయిలో 0.2 వరకు ఉంటుందని తెలిపారు. ఇది నాణ్యమైన మంచినీటిగా పరిగణించబడుతుందని చెప్పారు.

14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-చోడవరం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు చోడవరం గ్రంథాలయంలో వివిధ కార్యక్రమాల నిర్వహించనున్నట్లు స్థానిక గ్రంథాలయ అధికారిణి ఎమ్మెస్ఎల్ జోగేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిబేట్, వ్యాసరచన, చిత్రలేఖనం, డ్రాయింగ్‌తో పాటు పలు రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రంథాలయానికి వివిధ రూపాల్లో సహాయం అందించే దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో బికెపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు లింగన్న నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

టిడిపి కమిటీల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఇటీవల ఎన్నికైన అనకాపల్లి పట్టణంలోని జీవీఎంసీ 80, 81, 82, 83, 84 వార్డుల టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు సమక్షంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఎన్నికైన సభ్యులందరు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డిసిఎంసి చైర్మన్ కోట్ని బాలాజీ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, డాక్టర్ నారాయణరావు, పార్టీ నాయకులు మాదంశెట్టి నీలాబాబు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న టిడిపి నాయకులు



సమావేశంలో పాల్గొన్న వ్యాపారులు

15 నుంచి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధం

ప్రజాశక్తి - యలమంచిలి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశం మేరకు ప్లాస్టిక్ నిషేధంపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న అన్ని రకాల వ్యాపారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బిజెఎస్.ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం విషయం గురించి ఎంత ప్రయత్నించినా పూర్తి ఫలితాలు రావడం లేదని, అందుకు పూర్తి స్థాయిలో వ్యాపారులు సహకరించడం లేదని, భవిష్యత్తులో తమకు పూర్తిగా సహకరించాలని కోరారు. వస్తువులు అమ్మేటప్పుడు సంచులు తీసుకురమ్మని వినియోగదారుల్ని కోరాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ కనిపిస్తే భారీ జరిమానాలు విధించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 15 వరకు వ్యాపారులు సమయం కోరారు. అనంతరం ఎటువంటి శిక్షకైనా సిద్ధమని అంగీకారం తెలిపారు. ఈ నెల 15 తర్వాత పర్యావరణానికి హాని చేస్తున్న ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధం అమలు చేస్తామని చెప్పారు.

రోడ్డు సరిహద్దుల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని కొర్రప్రోలు గ్రామపంచాయతీ పరిధిలోని అడ్డరోడ్డు నుండి రేవు పోలవరం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు సరిహద్దుల గుర్తింపునకు రెవెన్యూ శాఖ మంగళవారం సర్వే నిర్వహించింది. మండల సర్వేయర్ ఏఎస్‌విఎస్ఎన్ సత్యనారాయణ నేతృత్వంలోని సర్వేయర్ల బృందం కొర్రప్రోలు కల్లు గోతులు వద్ద నుండి ఎన్టీఆర్ జంక్షన్ మధుమ దాటిన వరకు ఆర్ అండ్ బి రోడ్డు ఇరువైపులా సర్వే నిర్వహించి మార్కింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.ఉర్వారావు, వీఆర్వో శ్రీధర్, గ్రామ నాయకులు పెద్ద సత్తిబాబు, సర్వేయర్ టి.రాణి, కల్యాన వీఆర్ఏ అప్పారావు పాల్గొన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని డిఎల్‌డిఒ మంజులావాణి సూచించారు. మండలంలోని ఊడేరు గ్రామ సచివాలయాన్ని మంగళవారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. గ్రామంలో మంచినీటి పథకాన్ని, వాడుక నీరు నిల్వ ఉండిపోవడంతో దానిని కాల్వ తవ్వించి బయటికి పంపారు. క్లోరినేషన్, బ్లీచింగ్ చేయించి ప్రజలకు పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచు సిరిగిరిశెట్టి కృష్ణమోహన్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో మందుల నిల్వల పరిశీలన

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల నిల్వలను జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కె.ఇందిర భారతి మంగళవారం పరిశీలించారు. అనంతరం ప్రైవేట్ మెడికల్ షాపుల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలోని మెడికల్ షాపుల్లో నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అబార్షన్ కిట్లు, మత్తు మందులు విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బంధువుల ఇంటికి వెళ్లిన ఐద్వా నేత గృహ నిర్బంధం

ఖండించిన జిల్లా కార్యదర్శి వరలక్ష్మి

ప్రజాశక్తి- ఎస్.రాయవరం, అనకాపల్లి : నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్స్ కంపెనీని రద్దు చేయాలని మత్స్యకారులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో యస్.రాయవరం మండలం దార్లపూడిలో తమ బంధువుల ఇంటికి వెళ్లిన ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యాన్ని పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమానికి వెళ్తున్నట్లు అనుమానంతో అక్కడికి వెళ్ళవద్దని ఆమెకు తెలపడానికి మాత్రమే కానిస్టేబుల్‌ను పంపించడం జరిగిందని నక్కపల్లి సిఐ తెలిపారు. బల్క్ డ్రగ్ దగ్గరికి వెళ్లడం లేదని చెప్పినా పోలీసులు ఈ విధంగా బంధువుల ఇంటికి వెళ్లి అరెస్టు చేయడం చట్ట విరుద్ధమని, ఇటువంటి చట్ట విరుద్ధ అక్రమ అరెస్టులను చేస్తే మహిళా సంఘాలు చూస్తూ ఊరుకోదని మాణిక్యం స్పష్టం చేశారు. ఐద్వా నేత మాణిక్యాన్ని అక్రమంగా గృహ నిర్బంధం చేయడాన్ని ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పోలీసులు చేత ప్రజా సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసే విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు.



పోలీసు నిర్బంధంలో ఉన్న ఐద్వా నేత మాణిక్యం

భద్రత కట్టుదిట్టం

- అనుమానాస్పద కదలికలను తెలియజేయాలి
- ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి : దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటన నేపథ్యంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల భాగంగా జిల్లా వ్యాప్తంగా భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టం చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను దృష్టిలో ఉంచుకుని, జిల్లాలోని అన్ని పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ముఖ్యంగా విశాఖ దిశగా వెళ్తున్న వాహనాలను పరవాడ, సబ్బవరం చెక్‌పోస్టుల వద్ద పూర్తిగా తనిఖీ చేయాలని సూచించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, ప్రధాన కూడళ్లలో పోలీస్ సిబ్బంది స్పష్టంగా కనిపించే విధంగా తనిఖీలు జరపాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, స్థానిక పోలీసులు సమన్వయంతో సమాచార సేకరణను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, వస్తువులు గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులకు అవగాహన కల్పించాలని రైతు సాధికార సంస్థ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ ప్రకాష్ అన్నారు. అనకాపల్లి జిల్లా రైతు సాధికార సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ విభాగంలో కొత్తగా ఎంపికైన ట్రైనింగ్ ఐసిఆర్‌పిలకు రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను, రసాయనిక పురుగుల మందుల వాడ వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేయాలని రైతు సాధికార సంస్థ ప్రతినిధి విజయకుమార్ తెలిపారు. శిక్షణ పొందిన తర్వాత వారికి కేటాయించిన గ్రామాల్లో ఐసి ఆర్పీల సేవలను అందించాలన్నారు.

తుపాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మొంథా తుఫాన్ పునరావస బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన నిత్యవసర సరుకులను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్ మంగళవారం అందజేశారు. దేవరాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో కించుమండ, బోడిగరువు, బొడ్డగుడ, నేరెళ్లపూడి, జారురాయి కొత్తవలస, మదనగరువు గ్రామాలకు చెందిన 22 మంది గిరిజనులకు సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దాడ వెంకటరమణ, పోతల పాత్రునాయుడు, కిలపర్తి భాస్కరరావు, శరకాన సూర్యనారాయణ, సర్పంచ్‌లు సబ్బవరపు పెంటమ్మ, గూడపు రాము పాల్గొన్నారు.

నేడు 'జనవాణి' గ్రీవెన్స్

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి నియోజకవర్గం పరిధి మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యలమంచిలి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జనవాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. అర్జీలను ముందుగా రాసుకొని ఉదయం 9 నుండి 11 గంటల మధ్య హాజరు కావాలని కోరారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



అనకాపల్లిలో సంతకాలు చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యాన మంగళవారం అనకాపల్లి జిల్లా కోర్టు సముదాయం వద్ద, వేట జంగాలపాలెం గ్రామంలోనూ సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు స్వామి, పెంటయ్య నాయుడు, కుసుమ, పార్టీ నాయకులు కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని వంగలి గ్రామంలో ఎంపీటీసీ గవర తులసి రాజు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, ఎంపీపీ సూర్యకుమారి రామునాయుడు, పార్టీ నాయకులు గండి రవికుమార్, కర్రి బాబు పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ముద్రించిన వాల్ పోస్టర్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ తదితరులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ బుధవారం ఉదయం యలమంచిలిలో ప్రజా ఉద్యమం నిరసన ర్యాలీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేడ ప్రసాద్, బోదేపు గోవిందు, బొద్దపు ఎర్రయ్య దొర పాల్గొన్నారు.

తగరపువలస : పభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైసిపి కోటి సంతకాలు సేకరణలో భాగంగా ఈ నెల 12న చేపట్టే ప్రజా ఉద్యమ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఒకటో వార్డు పార్టీ ప్రెసిడెంట్ జగ్గుపిల్లి ప్రసాద్ కోరారు. మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ నుండి భీమిలి ఆర్‌డిఒ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కరమాని చినబాబు, జివ.రమణ, ఉప్పాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



యలమంచిలిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

సీతమ్మధార : జివిఎంసి 53 వార్డు పార్టీ కార్యాలయం వద్ద కోటి సంతకాల సేకరణ (రచ్చబండ) కార్యక్రమం నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, గుజ్జు వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం ఎవిఎన్ కాలేజీ డౌన్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు వైసిపి శ్రేణులతో చేపట్టనున్న ర్యాలీ నేపథ్యంలో ఆ మార్గంలో వైసిపి నేతలు మంగళవారం ట్రైల్ రన్ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపి అమ్మలు

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం గ్రామంలో ఆర్‌కె లేఅవుట్ నుండి బృందావన్ నగర్ వరకు రూ.5 లక్షల పంచాయతీ నిధులతో సిసి రోడ్ నిర్మాణ పనులను సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని రహదారి, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి ప్రాథమిక వసతుల అభివృద్ధిని క్రమంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తరుణ శ్రీ, ఉపసర్పంచ్ గొర్లి రామారావు, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి గొర్లి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షులు రొంగాలి నాయుడు, వార్డు సభ్యులు పోలిరెడ్డి అప్పారావు, పైల అప్పారావు పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణం కూల్చివేత

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి జాతీయ రహదారిని ఆనుకొని కొక్కిరాపల్లి వార్డు పరిధిలో హౌసింగ్ బోర్డు లే అవుట్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణ పునాదుల్ని పురపాలక సంఘం అధికారులు మంగళవారం కూల్చివేశారు. ప్లాట్ నెంబరు 2 సర్వే నెంబర్ 374 – 15 నుండి 20 వరకు గల స్థలంలో అక్రమ నిర్మాణం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చర్యలకు చేపట్టారు. ఈ ప్లాట్‌లో 173 స్క్వేర్ మీటర్ల విస్తీర్ణంలో ఎటువంటి అనుమతుల్లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని గుర్తించి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి కోసూరు పద్మ ఆధ్వర్యంలో నిర్మాణాన్ని అడ్డుకుని, పునాదులు కూల్చివేసినట్లు తెలిపారు.

ప్రజలకు సేవలందించడమే బిఒఐ లక్ష్యం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు అందించడమే బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్యంగా పనిచేస్తుందని అచ్చుతాపురం శాఖ మేనేజర్ విజయ్ కుమార్ చెప్పారు. మండలంలోని దోప్పర్ల గ్రామపంచాయతీ శివారు కొత్త గరువు గ్రామంలో అచ్యుతాపురం బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు బ్యాంకు కల్పిస్తున్న పలు కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నునబర్తి ఎంపీటీసీ పల్లి వెంకటేశ్వరరావు పిఏసిఎస్ కొండకర్ల డైరెక్టర్ రండి బాబురావు, జనరల్ సెక్రెటరీ కొల్లి సన్నిబాబు, కొల్లి వరహాలరావు కొల్లి వెంకటలక్ష్మి, కొల్లి సురేష్ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయతీ మాజీ సర్పంచ్ నెల్లిగోపి తండ్రి కొండలరావు అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి కొండలరావును పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెల్లి గోపి, ఉప సర్పంచ్ బలిరెడ్డి సూర్య ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం గ్రామ గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర రహదారులు అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు విడుదల చేశారు. బుధవారం గ్రామంలో జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పీలా తులసీరాము, కాండ్రేగుల సూర్యనారాయణ, కె వెంకటరమణ, శరగడము అప్పలనాయుడు, కే శ్రీహరి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్, నాగేశ్వరరావు

రైతాంగానికి వాతావరణ ఆధారిత సూచనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా రైతాంగానికి స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్తలు వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలను తెలియజేశారు. వరిలో ఆకుముడుత తెగులు, కాండం తొలిచే పురుగు ఆశిస్తే నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. గోధుమ రంగు మచ్చ తెగులు, పొడ తెగులు ఆశిస్తే హెక్సా కొనజల్ రెండు మిల్లీ లీటర్లు లేదా ప్రోఫికొనజోల్ ఒక మిల్లీలీటర్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. పొట్ట కుళ్ళు, కంకి నల్లి తెగులు ఆశిస్తే ప్రొపి కొనజల్ ఒక మిల్లీమీటర్, ప్రొఫెనోపాస్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. మానిపండు తెగులు ఆశిస్తే లీటరు నీటికి ఒక మిల్లీ లీటర్ ప్రొపి కొన జోల్ కలిపి పిచికారి చేయాలన్నారు. చెరకులో వలయపు మచ్చ తెగులు ఆశిస్తే నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు లేదా మాంకోజెబ్ మూడు గ్రాములు లేదా కార్బన్డిజం ఒక గ్రాము లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. చెరకులో తెల్ల దోమ ఆశిస్తే నివారణకు డైమిథోయేట్ 1.7 మిల్లీలీటర్లు లీటరు నీటివి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. కందిలో ఆకు చుట్టు పురుగు ఆశిస్తే మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. కూరగాయల్లో రసం పీల్చు పురుగు ఆశిస్తే డైమితోయేట్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. పసుపులో తాటాకు మచ్చ ఆశిస్తే నివారణకు కార్బన్డిజం ఒక గ్రాము, మాన్కోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.

శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చియ్యపేట మండలం వడ్డాది సచివాలయంలో మంగళవారం నుంచి శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభించారని పంచాయతీ ఈవో లోవరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాలలోపు పిల్లలకు బాల ఆధార్ కార్డ్, ఐదేళ్లు దాటినవారికి ఈకేవైసీ బయోమెట్రిక్, పేర్లు మార్పిడి, పుట్టిన తేదీ సవరణ, అడ్రస్ మార్పు వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆధార్ ఇంచార్జ్ జెర్రిపోతుల గంగరాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

ఉమ్మలాడ సర్పంచ్‌కు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని ఉమ్మలాడ గ్రామ సర్పంచ్ సూరిశెట్టి గంగయ్యమ్మ గ్రామానికి అందించిన సేవలకుగాను ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ మేరకు హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో మక్స్ గ్లోబల్ ఫౌండేషన్ వారు సమకూర్చిన ఈ అవార్డును ఎమ్మెల్సీ ఎస్ మధుసూదన్‌రావు, ఫౌండేషన్ నిర్వాహకులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ చెరుపల్లి చేతుల మీదుగా సర్పంచ్ తనయుడు రామకృష్ణ అందుకున్నారు. కరోనా కష్టకాలంలో తన సొంత నిధులతో గ్రామంలో బ్లీచింగ్, మందుల పంపిణీ, అంగనవాడీ కేంద్రాలలో ఫ్యాన్లు, బీపీ, షుగర్ వంటి రోగాలకు మిషన్లను ఏఎన్ఎంలకు సమకూర్చారు. ఈ మేరకు ఆమెకి ఈ సేవ పురస్కారం అందజేసినట్లు తనయుడు రామకృష్ణ తెలిపారు.

'మన డబ్బులు- మన లెక్కలు' పై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో లింగాపురం గ్రామంలో 'మన డబ్బులు మన లెక్కలు'పై డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలలో ఎటువంటి అవకతవకలకు చోటు లేకుండా ప్రభుత్వం మన డబ్బులు మన లెక్కలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు సీసీలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కొక్కిరాపల్లి ప్రమాదంలో మరో మహిళ మృతి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : మండలంలోని కొక్కిరాపల్లి జంక్షన్ సమీపంలోని ప్రేమ సమాజం వద్ద ఈ నెల 3న ఆటోను టాటా మ్యాజిక్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో మహిళ మృతి చెందారు. విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మాకవరపాలెం మండలం, రామన్నపాలెం గ్రామానికి చెందిన కొరుప్రోలు కనక సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై ఉపేంద్ర మంగళవారం తెలిపారు. మొత్తంగా ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు పేర్కొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-చోడవరం : జిల్లా సహాయ పరీక్షల నిర్వాహకులు ఎ.శ్రీధర్ రెడ్డి చోడవరం మండలంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, పకీర్ సాహెబ్ పేట, బాష్యం, గోవాడ, లక్కవరం తదితర ఆరు పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను సందర్శించారు. భవనాల పరిస్థితి, విద్యుత్, ఫర్నీచర్, ప్రహరీ, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ పాండురంగారావు, నోడల్ హెచ్‌ఎం వివి.శేషగిరిరావు, పరీక్షా కేంద్రాల హెచ్ఎంలు రామిరెడ్డి, మల్లిఖార్జునరావు, శేషుబాబు, పి.కావ్య, సిఆర్‌యమ్‌టి కెవియమ్.నాయుడు పాల్గొన్నారు.



తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా వెంకటేశుని తిరువీధి సేవ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండల కేంద్రం ఎస్.రాయవరం గ్రామంలో శ్రీవైభవ వెంకటేశ్వర స్వామి వారి తిరిగి సేవ మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి వారి పదవ వార్షిక కళ్యాణోత్సవాల్లో భాగంగా ఉభయదేవేరులతో కూడిన స్వామివారు గ్రామంలో తిరివీధి సేవలో పాల్గొన్నారు. రాత్రి 9 గంటలకు స్వామివారి కళ్యాణం కన్నుల పండుగ నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 11 గంటల నుండి భారీ స్థాయిలో అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సోమిరెడ్డి రాజు, లక్కోజు ఆదిమూర్తి, సత్తిబాబు, కొనతల శ్రీను పాల్గొన్నారు.

ఆర్య వైశ్యుల కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ ఎదురుగా ఉన్న మామిడి తోట ఆర్యవైశ్యుల కార్తీక వన సమారాధనతో మంగళవారం సందడి వాతావరణం నెలకొంది. మండల వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు మహిళలు, యువత, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. విభిన్న వినోద క్రీడలు, కిట్టీ పార్టీలు నిర్వహించారు. ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తదితరులు వన సమారాధనలో పాల్గొన్నారు.

రూ.15 వేలు పింఛను ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : 85 శాతం సదరం సర్టిఫికెట్ ఉండి మంచానికి పరిమితమైన వికలాంగులకు రూ.15వేలు ఎన్టీఆర్ భరోసా పింఛను పొందుటకు అవకాశం కల్పించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణికి ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ కార్యకర్త ఆకులు నాగేశ్వరరావు మంగళవారం విశాఖపట్నంలో వినతిపత్రం అందజేశారు. వికలాంగులు మంచానికే పరిమితం కావడంతో ప్రభుత్వం మానవతాదృక్పథంతో పెన్షన్ నగదును పెంచి ఇవ్వాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న నాగేశ్వరరావు

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

పారిశ్రామిక ప్రాజెక్టులు, ఎంఎస్ఎంఇ పార్కుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో మంత్రులు



పెదగంట్యాడ శంకుస్థాపనలో మంత్రులు శ్రీబాలవీరాంజనేయస్వామి, సుభాష్, ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు



అచ్యుతాపురంలో మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి - అచ్యుతాపురం : స్థానికంగా ఎటిసి టైర్స్ ఎపి ప్రైవేట్ లిమిటెడ్ వేదికగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మైన్స్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, హోం శాఖ మంత్రి అనిత, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారి వెంట అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, పలువురు పారిశ్రామిక ప్రముఖులు ఉన్నారు. అనకాపల్లి జిల్లాలో దాదాపు రూ.3,922 కోట్ల విలువైన మొత్తం తొమ్మిది ప్రాజెక్టులకు సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టారు. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4,500 మందికిపైగా ఉపాధి లభించనుందని మంత్రులు తెలిపారు. రూ.700 కోట్లతో ఏర్పాటు చేసిన ఎటిసి టైర్స్ ఎపి ప్రైవేట్ లిమిటెడ్ ఫేజ్-3 యూనిట్‌ను, రూ.706 కోట్లతో ఏర్పాటు చేసిన లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ యూనిట్-8ను స్థానికంగా ప్రారంభించారు. రూ.1,175 కోట్ల అంచనా పెట్టుబడితో బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ తయారీ, రూ.573 కోట్లతో లారస్ బయో ప్రైవేట్ లిమిటెడ్ వంటి భారీ ప్రాజెక్టులతో సహా ఏడు కొత్త పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎటిసి టైర్స్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అండ్ ప్లాంట్ హెడ్ బి.ప్రహ్లాద రెడ్డి, లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్.నరసింహారావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరవాడ : రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కులు వర్చువల్ పద్ధతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఇందులో భాగంగా పరవాడ మండలం ఏపీఐఐసీ ఫేస్-2లో ఎంఎస్ఎంఈ పార్క్ శంకుస్థాపన జరిగింది. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయన మాట్లాడుతూ ఫేజ్-2లో 50 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ పార్కులో 300 నుంచి 1500 గజాల వరకు పారిశ్రామిక స్థలాలను దాదాపు 99 మంది యాజమాన్యులకు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ సూర్యనారాయణ, మండలం స్పెషల్ ఆఫీసర్ సరోజిని, ఆర్డీవో నాగరాజు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పల నాయుడు, మాజీ జెడ్పిటిసి సభ్యులు పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసరపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

గాజువాక : పెద గంట్యాడలో ఎంఎస్ఎంఇ పార్కుకు రాష్ట్ర సామాజిక సంక్షేమ, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ శ్రీభరత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ, పెదగంట్యాడలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంద న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి పైనాపిల్ కాలనీలో 2.18 ఎకరాల స్థలంలో రూ.7.50 కోట్లతో 31 యూనిట్లతో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పార్కుకు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి ఇన్‌చార్జ్ హరిధర్, జెడ్ఎం ఎ.సింహాచలం, జెడ్సీ కనకమహాలక్ష్మీ, వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, తురకపూడి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వరాహ ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన

నక్కపల్లి : నక్కపల్లి మండలంలో వరాహ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు సంతోషకరమని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు మంగళవారం. మండలంలో బుచ్చిరాజుపేట పంచాయతీ నల్లమట్టిపాలెం వద్ద ఏర్పాటు చేయనున్న వరాహ ఇండస్ట్రియల్ పార్క్‌కు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ముందుగా వరాహ ఇండస్ట్రియల్ పార్క్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ఈ పార్కు ఏర్పాటుతో ఐదువేలు నుంచి ఆరువేల మందికిఉద్యోగాలు రానున్నాయన్నారు. ఈ రోజు రాష్ట్రంలో పెట్టుబడులు పండుగ జరిగిందన్నారు.

గత ప్రభుత్వంలో చెత్తపై కూడా పన్ను వేస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చెత్త నుండి సంపద సృష్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో తక్కువ సమయంలోనే పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నామన్నారు. గ్రామస్తులు, ,రైతుల త్యాగంతో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో ఀ.స్థానిక యువతకు ఉపాధి,ఉద్యోగావశాలు అవకాశాలు కల్పించమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో

వరాహ ఇండస్ట్రియల్ పార్క్ చీఫ్ ప్రమోటర్, సిఇఒ డాక్టర్ శ్రీనివాస రాఘవ, భాగస్వాములు ఎం.ఎ. నాయుడు, ఎం కె విశ్వనాథ్, వి సరళ, ఎం ఉషారాణి, పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, బుచ్చిరాజుపేట సర్పంచ్ కాళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ పోటీలకు నాగజ్యోతి ఎంపిక



నాగజ్యోతిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

ప్రజాశక్తి-రోలుగుంట : రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు, క్రీడాకారిణి పివిఎం.నాగజ్యోతి ఈ నెల 14 నుంచి 17 వరకు భూటాన్‌లో సంయుక్త భారతి ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్నేషనల్ పవర్‌లిఫ్టింగ్ అండ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. నాగజ్యోతి ఇప్పటివరకు అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించిన విషయం తెలిసిందే. క్రీడారంగంలో అద్భుత ప్రతిభ చూపిస్తూ తన పట్టుదలతో గుర్తింపు తెచ్చుకున నాగజ్యోతి, అంతర్జాతీయ పోటీల్లో కూడా రాణించి, దేశానికి గౌరవం తెచ్చిపెట్టాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా నాగజ్యోతికి లయన్స్ క్లబ్, వాసవి క్లబ్ ప్రతినిధులు అధికారులు సభ్యులు, సహోపాధ్యాయులు, స్థానిక వార్డు సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవిపణిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

విద్యుత్ ఎఇఇ రాంబాబుకు సత్కారం



ఎఇఇ రాంబాబును సత్కరిస్తున్న విద్యుత్ సిబ్బంది

ప్రజాశక్తి -మాడుగుల: మాడుగులలో ఎపిఇపిడిసిఎల్ ట్రాన్స్‌కో ఆపరేషన్స్ విభాగం ఎఇఇగా మూడేళుల విధులు నిర్వహించి, బదిలీపై మాతృసంస్థ ఒడిశాకు వెళుతున్న ఎం.రాంబాబును ఘనంగా సత్కరించారు. విద్యుత్ శాఖ జెఇ జగదీశ్వరరావు, లైన్ ఇన్స్పెక్టర్ అప్పచ్చిబాబు ఆధ్వర్యంలో ఎఇఇ రాంబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి, పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. ఎపి జెన్‌కో నుంచి డెప్యుటేషన్‌పై వచ్చి మూడేళ్లపాటు మాడుగులలో ఆపరేషన్స్ విభాగంలో రాంబాబు విధులు నిర్వర్తించారు. ఇపుడు మాతృసంస్థ జెన్‌కోకు ఒడిశా వెళ్లిపోయారు. ఈ సందర్భంగా మండలంలో విద్యుత్ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, వాటి పరిష్కారానికి కృషిచేస్తూ మంచి అధికారిగా రాంబాబు గుర్తింపు పొందారని ఆయన సేవలను కొనియాడారు. విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల దత్తతపై అవగాహన



మాట్లాడుతున్న మంగ

ప్రజాశక్తి - చీడికాడ : అనాథ పిల్లలను గుర్తిస్తే వారి సమాచారాన్ని జిల్లా బాలల సంరక్షణ కేంద్రానికి అందించి సహకరించాలని డిసిపియు సామాజిక కార్యకర్త డి మంగ కోరారు. మంగళవారం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ దత్తత అవగాహన మాసోత్సవాల్లో భాగంగా జి కొత్తపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపియు సామాజిక కార్యకర్త డి మంగ మాట్లాడుతూ జాతీయ దత్తత కార్యక్రమం ఈనెల 1 నుండి 30వ తేదీ వరకు జరుగుతుందనాన్రు. ముఖ్యంగా సంతానం లేని,పిల్లలను దత్తత కావాలనుకుంటే తల్లిదండ్రులకు జిల్లా దత్తత విభాగానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుంటే, జాతీయ దత్తత కార్యక్రమం ద్వారా చట్టబద్ధంగా పిల్లలను దత్తత చేస్తారని తెలిపారు. గ్రామాలలో జీరో టు ఆరేళ్లలోపు అనాథ పిల్లలును గుర్తించి వారిని ప్రత్యేక దత్తత సంస్థకు సమాచారమిస్తే, వారిని సంస్థ చేరదీస్తుందని అన్నారు కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి సూర్య నాయుడు, ఎంపిడిఒ శ్యామ్ సుందరరావు, ఎఒ శ్రీనివాస్, మహిళా పోలీస్ ఎన్ సంతోషి, సైక్రియాట్రిస్ట్ బి అనిల్‌కుమార్, నాయకులు అప్పలనాయుడు, పైడిమ నాయుడు, పాల్గొన్నారు.

ఐక్యతతోనే మహిళల ఆర్థిక స్వావలంబన



చెక్‌ను అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం: మహిళల ఐక్యతతోనే ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు, మంగళవారం మాకవరపాలెం మండలంలో మహిళా సమాఖ్య నిర్వహిస్తున్న మార్ట్ ద్వారా రూ.14.32 లక్షల ఇతర ఆదాయం చేకూరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు, ఈ మేరకు సమాఖ్య సభ్యులకు లాభాల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ కేవలం 22 నెలల వ్యవధింలోనే మహిళా మార్టు ద్వారా రూ.14.32 నికర లాభాలు ఆర్జించడం సంతోషమన్నారు. స్థానికంగా తయారైన ఉత్పత్తులను విక్రయించడం ద్వారా మరింత లాభాలు చేకూరే అవకాశం ఉన్నందున, ఆ దిశగా మహిళలు ముందుండాలని కోరారు, కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి శచీదేవి, ఎంపిడిఒ ఛాయాసుధ, చాయసుధ, తాహసిల్దార్ రమణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సూర్యచంద్ర, ఆర్ వై పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం చందక పంచాయతీ జగన్నాథపురం గ్రామంలోని రచ్చబండ సమీపంలో ఎంపిపి నిధులు సుమారు రూ.2 లక్షలతో బోరు ఏర్పాటుకు వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, స్థానిక సర్పంచ్ బంక శ్రీను శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అప్పలరాజు, రెల్లి గురినాయుడు తదితరులు పాల్గొన్నారు.

13న సాగరదుర్గ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో ఉన్న సాగరదుర్గ ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు బుగత సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక హోమాలు, కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనుమతుల్లేని నిర్మాణాలపై చర్యలు



పంచాయతీ కార్యదర్శి తో మాట్లాడుతున్న విఎంఆర్‌డిఎ అధికారులు

ప్రజాశక్తి-నక్కపల్లి : ప్లాన్ అప్రూవల్ లేకుండా భవన నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(విఎంఆర్‌డిఎ) అధికారులు హెచ్చరించారు. మంగళవారం నక్కపల్లి పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌తో విఎంఆర్‌డిఎ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ పి అమ్మాజీ రావు, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ ఎన్ సతీష్‌రావు సమావేశమయ్యారు. అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే వెంటనే నోటీసులు జారీ చేయాలని సూచించారు. ప్లాన్ అప్రూవల్ లేని భవన నిర్మాణాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

గ్రానైట్ క్వారీలకు అనుమతులు ఇవ్వొద్దు

- పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభలో స్పష్టీకరణ
- కలుషిత నీటి బాటిళ్లతో గిరిజనుల వినూత్న నిరసన



గ్రామసభలో కలుషిత నీటి బాటిళ్లతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -మాడుగుల. : జిల్లాలో గ్రానైట్ క్వారీలకు కొత్తగా అనుమతులు ఇవ్వొద్దని, ఇప్పటికే ఇచ్చిన వాటిని రద్దు చేయాలని సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బాధిత ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని ఆవురువాడ పంచాయతీ ఎ.వీరనారాయణంలో 5.220 హెక్టర్ల పరిధిలో మెన్సర్ అటార్నీ ఎంటర్‌ప్రైజెస్‌కు గ్రానైట్ క్వారీ ఏర్పాటుకు నర్సీపట్నం ఆర్‌డిఒ వి.వి.రమణ, పర్యావరణ విభాగంఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి వెంకట ముకుంద రావు, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల ఆధ్వర్యం లో నిర్వహించిన పర్యావరణ, కాలుష్య అనుమతులకు ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. చిన్నగొర్రిగెడ్డ పరిసరాల్లో క్వారీ ఏర్పాటుతో భూగర్భజలాలు అడుగంటిపోవడంతోపాటు కలుషిత బురదనీటితో తాము పడుతున్న కష్టాలపై ఆవేదన వ్యక్తం చేస్తూ, కలుషితనీటి బాటిళ్లను తెచ్చి, గ్రామసభలో నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇప్పటికే ఆవురువాడ పంచాయతీ పరిధిలో గొర్రిగెడ్డ, సీతబందలి, తుమ్మవానిపాలెం గ్రామాల్లో ఆరు కలర్ గ్రానైట్ క్వారీల ఏర్పాటులో ఆయా గ్రామాల్లో ఒకపుడు 40అడుగులకే వచ్చే సురక్షితమైన తాగునీరు, నేడు భూగర్భ జలాలన్నీ అడుగంటిపోవడం బోరుబావులన్నీ ఇంకిపోయి, నేడు 200 అడుగులుపైబడి రిగ్గుతో బోరు పాయింట్లు వేసి నీరు రావడం లేదని, ఎక్కడైనా నీరు వస్తే అది తాగడానికి, వినియో గానికి ఏమాత్రం పనికి రానంతగా కాలుష్య కారకంగా వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఒకపుడు ఏడాదిపొడుగునా జలకళతో ఉన్న సీతబందలి లోని, పోతురాజు గెడ్డ, కాంగులగెడ్డ, కిర్రిమానుగెడ్డ వంటి ఊటగెడ్డలతో పాటు చిన్న గొర్రిగెడ్డ రిజర్వాయర్ సైతం క్వారీ వ్యర్థాలతో నిండిపోయి, ప్రస్తుతం వర్షాల సీజన్‌లోనూ నీరివ్వని పరిస్థితికి చేరుకుని వాటి పరిధిలోని ఆయకట్టు భూములన్నీ బీడులుగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.క్వారీ వ్యర్థాలతో కాలుష్య కారకమైన నీటిని తాగుతూ గిరిజనులు కిడ్నీలు పాడై, ఇతరత్రా అనారోగ్య సమస్యలతో సతమతమౌతూ అర్థాయుష్కులుగా దుర్భర జీవనం సాగిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు.

గతంలో క్వారీలకు అనుమతులు కోరినప్పుడు ప్రభావిత గ్రామాల్లోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడతామని మోసపూరిత మాటలతో నమ్మబలికి, తీరా అనుమతులు వచ్చిన తర్వాత నిర్లక్ష్యంగా వదిలేసిన అనుభవాలు బాధిత ప్రజలందరికీ ఎరుకేనన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో సిఎస్ఆర్ ఫండ్స్‌తో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్న హామీలు నేటికీ అమలుకు నోచుకోని పరిస్థితి ఉందన్నారు. మినరల్ వాటర్‌ప్లాంట్‌ల ఏర్పాటు మాట నీటకలిసిపోయిందని మండిపడ్డారు. మరోమారు అలాంటి బూటకపు మాటలను నమ్మే పరిస్థితుల్లో తాము లేమని, ఎట్టిపరిస్థితుల్లోనూ కొత్తగా గ్రానైట్ క్వారీలకు ఎటువంటి అనుమతులు ఇచ్చేందుకు తాము ససేమిరా ఒప్పుకోబోమని తేల్చిచెప్పారు. గిరిజనుల ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కె భవాని సంఘీభావం తెలిపి పాల్గొన్నారు. నిరసనలో గ్రామస్తులు కింజ లక్ష్మి, సుర్ల కొండమ్మ, అరకు అప్పారావు, రాజబాబు, కొండబాబు, కొప్పల ఈశ్వరరావు పాల్గొన్నారు.

భాగస్వామ్య సదస్సు భద్రతపై సమీక్ష

ప్రజాశక్తి- నక్కపల్లి : ఈ నెల 14,15 తేదిల్లో విశాఖపట్నంలో జరగనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై మంగళవారం నక్కపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి హోంమంత్రి వంగలపూడి అనిత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ ఉన్నతా ధికారులతో సమీక్షించారు. సమ్మిట్‌కు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు, కేంద్ర,రాష్ట్ర మంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను అత్యంత పటిష్ఠంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విశాఖ నగరమంతా ం డ్రోన్‌లు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతరం నిఘాఉండాలని, ఫైర్ సేఫ్టీ, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే సమ్మిట్ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణపై ముందుగానే ప్రజలకు సమాచారం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా

అలుపెరగని పోరు

59వ రోజుకు మత్స్యకారుల ఆందోళన



దీక్షాశిబిరంలో నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి- నక్కపల్లి : బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ జీవితాలను నాశనం చేయొద్దని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు మంగళవారం నాటికి 59వ రోజుకు చేరుకున్నాయి. బల్క్ డ్రగ్ ఏర్పాటు వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే తమ జీవితాలు బుగ్గిపాలవుతాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికే హెటిరో కంపెనీ వ్యర్థ రసాయన జలాలు సముద్రంలో వదలడం వల్ల సముద్ర జలాలు కలుషితమై చేపలు ఉత్పత్తి తగ్గిపోవడంతో ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఉప్పుటేరులో కూడా కంపెనీ వ్యర్థ రసాయన జలాలు కలవడం వల్ల ఇప్పటికే అనేకసార్లు చేపలు మృత్యువాత పడ్డాయన్నారు. ఆనీటిని తాగిన , పశువులు కూడా మృతి చెందిన సందర్భాలున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. కంపెనీ కాలుష్యం కారణంగా ప్రాణాంతకర వ్యాధులు సోకడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కేన్సర్ వంటి వ్యాధులు సోకి పలువురు మృత్యువాత పడ్డారని వాపోయారు.. ఇటువంటి పరిస్థితుల్లో తామంతా అనేక రకాలుగా ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే ఏకంగా తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. తమ జీవన విధానాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు. కార్యక్రమం లో మత్స్యకార నాయకులు మైలపల్లి మహేష్ బాబు, పిక్కి తాతీలు, గోసల సోమేశ్వరరావు, కోడ కాశీరావు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఐఆర్ఎస్ అధికారి శ్రీనివాస్

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామిని ఆదాయపు పన్ను-1 ప్రిన్సిపల్ కమిషనర్, ఐఆర్ఎస్ అధికారి బి.శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామి వారి మూలవిరాట్టును దర్శించుకున్న అనంతరం పండితులు వారికి వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేసి సన్మానించారు.

సమస్యలపై ఎమ్మెల్యే గంటాకు వినతి

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి జోన్ పరిధిలోని పలు సమస్యలపై ఉత్తరాంధ్ర దళిత నాయకులు భాగం గోపాలరావు మంగళవారం ఎంవిపి కాలనీలోని క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. తగరపువలసలో ఆర్‌టిసి కాంప్లెక్స్, కల్యాణ మండపం నిర్మించాలని, గుంతలమయమైన భీమిలి - తాళ్లవలస రహదారి బాగుచేయాలని కోరారు.

ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతులకు ఎరువుల సరఫరాలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మొంథా తుఫాన్ వలన జిల్లాలో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని, వరి పొలాలు నీట మునిగి ఆ నష్టాలనుంచి కోలుకోకముందే, ఇప్పుడు యూరియా అందక రైతాంగం తీవ్ర నిరాశలో వున్నారని పేర్కొన్నారు. రైతులకు అవసరమయ్యే ఎరువులు అందుబాటులో వుంచకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. వరి పంట పొట్టదశలో వుండడంతో యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల వద్ద రైతులు ఉదయం నుంచి బారులు తీరుతున్నారని తెలిపారు. యలమంచిలి, మునగపాక వంటి ప్రాంతాల్లో యూరియా పంపిణీ సమయంలో తోపులాటలు చోటుచేసుకోవడం చేస్తూంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుందన్నారు. రైతులు చెమటోడ్చి పండించిన పంటలను కాపాడుకోవడానికి తెల్లవారుజామునే క్యూ లైన్లలో ఎరువులు కోసం నిలబడి ఎదురుచూడాల్సి రావడమంటే ఇది పూర్తిగా కూటమి ప్రభుత్వ వైఫల్యం తప్ప మరొకటికాదని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సరిపడా యూరియా, ఎరువులు అందుబాటులో వుండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

యూరియా పంపిణీ చేయాలి

మునగపాక : రైతులకు వెంటనే యూరియా పంపిణీ చేసి వారిని ఆదుకోవాలని వైసిపి అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సచివాలయంలో యూరియా పంపిణీ జాప్యం జరగడం పట్ల మంగళవారం సిబ్బందితో ఆయన వాగ్వాదానికి దిగారు. అధికారులతో ఫోన్లో సంభాషించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల యూరియా కష్టాలను పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆరోపంచారు. కార్యక్రమాల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందిని నిలదీస్తున్న వైసిపి నేత బొడ్డేడ ప్రసాద్

జాతీయ స్థాయి పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-పాయకరావుపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈ నెల 8 నుండి 10 వరకు విజయనగరంలో జరిగిన అండర్ -19 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ఎస్.శశి కిరణ్, కె కావ్య సుధ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ఎపి స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి 8వరకూ జరిగిన రోలర్ స్కేటింగ్ పోటీల్లో టి.కళానిధి 500 మీటర్ల మిక్సడ్ రిలే పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి, రెండు రజిత పథకాలను కైవసం చేసుకున్నట్లు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ అపర్ణ, హెచ్‌ఎం సీతారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం అభినందించారు.



ఎంపికైన శ్రీప్రకాష్ విద్యార్థులు వీరే

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిట్టిబాబు

ప్రజాశక్తి-పాయకరావుపేట : రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టరుగా పట్టణానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుండి చిట్టిబాబుకు సమాచారం అందింది. చిట్టిబాబుకు పదవి రావడం పట్ల నియోజకవర్గంలోని కూటమి పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శాలువాలు, బొకేలతో అభినందించారు. తనకు పదవి ఇచ్చిన హోంమంత్రి వంగలపూడి అనితకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు చిట్టిబాబు కృతజ్ఞతలు తెలిపారు.